విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 30 అక్టోబర్ 2024 8 పేజీలు

మంత్రులను కలిసిన సీపీఐ ప్రతినిధి బృందం

ప్రకాశం జిల్లాలోని పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు 2వేల కోట్లు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆధ్వర్యంలో సీపీఐ ప్రతినిధి బృందం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళవారం వెలుగొండ ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర మంత్రులతో మాట్లాడుతూ పూలసుబ్బయ్య పేరుతో జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వెలుగొండ ప్రాజెక్టు పట్ల గతంలో కాంగ్రెస్, వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యం జరిగిందని, ఇప్పటికైనా ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు.

2 లో

-విశాలాంధ్ర బ్యూరో, ఒంగోలు :

జీవనాడి 'వెలిగొండ'

- పోలవరం తర్వాత అతిపెద్ద ప్రాజెక్టు ఇదే
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తాం
- గత ప్రభుత్వంలో ప్రాజెక్టును పూర్తి చేసామని మభ్యపెట్టారు
- అన్ని పనులు అసంతృప్తిగానే
- నిధులు కేటాయించి పూర్తి చేస్తాం
- వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంపీ

ప్రకాశం జిల్లా జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్ట్‌ను ప్రాధ్యాన్యతా క్రమంలో త్వరలో పూర్తి చేసి ప్రకాశం జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు అందిస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రకాశం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలసి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలను తెలిపారు.

4లో

- విశాలాంధ్ర - మార్కాపురం :

అంతిమ యాత్రకు అన్నీ అవస్థలే

- నీటిలో మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు
- నీటిలోనే సమాధి చేసిన వైనం
- అధ్వానంగా దళిత వాడల స్మశానవాటికలు
- అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వేడుకోలు

విశాలాంధ్ర - కర్లపాలెం : మానవుని జీవితంలో ఆఖరి మజిలీ ఘట్టం అత్యంత కీలకం. ఓ వ్యక్తి భూమి మీద బ్రతికి మరణించిన తర్వాత అన్నింటిని వదిలి పరలోకానికి వెళ్లే క్రమంలో కుటుంబీకులు, బంధువుల అత్యంత భాదతో అంత్యక్రియలు జరుపుతారు. ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుని అంత్యక్రియలు నిర్వహించేందుకు స్మశాన వాటికకు వెళ్లే దారులు సక్రమంగా లేక నీటిలో నడిచి వెళ్లలేక పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

– బాపట్ల జిల్లా కేంద్రానికి సరిగ్గా 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్లపాలెం పంచాయతీ దాస్ నగర్‌లో మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందగా అతని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు దారి లేక నీళ్లలో పార్థివ దేహాన్ని మోకాళ్లు లోతు నీళ్లల్లో మోసుకెళ్ళుతూ కుటుంబీకులు, బంధువులు చాలా అవస్థలు పడ్డారు. సాంప్రదాయ

- మిగతా 2 లో

బడిలో గుడ్లు మాయం

- పాఠశాలలలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తనిఖీలు
- టంగుటూరు హైస్కూల్లో మిడ్ డే మీల్స్ అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ బత్తుల పద్మావతి

-విశాలాంధ్ర, టంగుటూరు:

2 లో

నవంబర్ 20న నీటి సంఘాల ఎన్నికలు

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

నీటి సంఘాల ఎన్నికలు నవంబర్ 20నన నిర్వహించదానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఆర్‌డిఓలు, తహసీల్దార్లతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు.

2 లో

-విశాలాంధ్ర, బాపట్ల :

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. మన్నేపల్లి, తురక పాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద రావు మాట్లాడుతూ... మండలంలో 2910 ఎకరాలలో వరి సాగు చేసారని చెప్పారు. వరిలో ప్రధానంగా ఉల్లి కోడు, గొట్టాలు, గొట్టపు రోగం, కాండం తొలుచు పురుగు లేద లెల్ల కంకి ఆకు ముదుత నోము వంటి పలు తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున నివారణ చర్యలను సూచించారు. వీఏఏలు నాగ రాజు, బ్రహ్మయ్య, సుధీర్‌లు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రామారావు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల శాఖ ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా తాళ్లూరి రామారావు, ప్రధాన కార్యదర్శిగా తోట యోగి రాములను ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్ బాషా, కే శ్రీనివాసరావు, పొదిలి మండల శాఖ ప్రధాన కార్యదర్శి మంచికల కోటేశ్వరరావులు, కొనకనమిట్ల మండలం విద్యాశాఖ అధికారి ఎస్ కే దాంగే షరీఫ్ ను కలిసి మండల శాఖను పరిచయం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు.

బసినేపల్లిలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని బసినేపల్లి, జెన్నివారిపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధి కారిణి జక్కం మెర్సీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని కంది పంటను పరిశీలించి కందిలో కలుపును అంతర కృషి చేయటం ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. 2014 నుంచి 2019 కి మధ్యలో ఉన్న పద్ధతిని ఈ సంవత్సరం రబీ కాలం నుంచి ఇన్సూరెన్స్ అమలు చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకుల ద్వారా గాని మీసేవ సెంటర్ ద్వారా గానీ రైతులే ప్రీమియం చెల్లించి డిసెంబర్ 15వ తేదీ లోపు తమ పంటలకు బీమా చేయించుకోవాలని తెలిపారు. అలాగే విత్తనోత్పత్తి కోసం మొక్కజొన్న వేసిన రైతులు సదరు కంపెనీ ద్వారా అగ్రిమెంట్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. ప్రస్తుతం జిల్లాలో పొగాకు పంట అధికంగా సాగు చేయడం వల్ల దానికి ధర తగ్గే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయంగా కంది మినుము పంటలను వేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ డీవీ శివ రామయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతాప్ రెడ్డి , రైతులు పాల్గొనడం జరిగింది.

అంతిమ యాత్రకు అన్నీ అవస్థలే

(మొదటిపేజీ తరువాయి)

బద్దంగా మృతి చెందిన వ్యక్తి పార్థివ దేహాన్ని పూడ్చేందుకు స్మశాన వాటికలో గుంట తీయగా నీళ్లు ఊబికి వస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో అదే నీట్లో మృతదేహాన్ని పూడ్చాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరుగులు పెడుతున్న నేటి ఆధునిక యుగంలో మానవుని జీవితంలో ఆఖరి మజిలీ కోసం అవస్థలు పడటం చింతించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్న ఎన్నో దఫాలుగా స్మశానాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయమని కోరుతున్న ఏ ప్రభుత్వాలు కూడా దళిత స్మశానాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు. నేటికి చాలా ప్రాంతాల్లో స్మశానాలకు దారులకు లేక కబ్జాలకు గురై ఇబ్బందులు పడుతున్న పరిస్థితి జిల్లాలో ప్రతి రోజు ఏర్పడుతున్న సంఘటనలు. పాలకులు, అధికారులు ఇప్పటికైన దృష్టి సారించి ఆఖరి మజిలీకి వెళ్లే దారులు, స్మశానల అభివృద్ధికి చర్యలు, మెరక తొలకం చేపట్టాలని ప్రజలకు కోరుతున్నారు.

మంత్రులను కలిసిన సీపీఐ ప్రతినిధి బృందం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలోని పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు 2వేల కోట్లు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆధ్వర్యంలో సీపీఐ ప్రతినిధి బృందం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళవారం వెలుగొండ ప్రాజెక్టును సందర్శించేందుకు జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు జిల్లాకు చెందిన సాంఘిక శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవితో పాటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం అధికారులతో ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మంత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. మహనీయుడు పూలసుబ్బయ్య పేరుతో జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న వెలుగొండ ప్రాజెక్టు పట్ల గతంలో కాంగ్రెస్, వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యం జరిగిందని, ఇప్పటికైనా ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా గ్రామాలను ఖాళీ చేయాలని చెప్పన్నారని, వెంటనే నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సౌకర్యాలు ఇవ్వాలని కోరారు. మరోపక్క ప్రాజెక్టుకు సంబంధించి కెనాల్స్‌ను నిర్మించాలని దానికి సంబంధించి పనులు వేగవంతంగా చేపట్టాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వెనుకబడిన పశ్చిమ ప్రకాశం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. ఒక్క ప్రకాశం జిల్లానే కాకుండా కడప , నెల్లూరు జిల్లాలకు కూడా కొంతమేరకు మేలు జరుగుతుందని అన్నారు.

ప్రతిష్ఠాత్మకమైన వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి బదులిచ్చారు. ఈ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు తరువాత అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు ఉందంటే అది వెలుగొండ ప్రాజెక్టేనని దీనిని త్వరితగతిన పూర్తి చేస్తామని సీపీఐ నేతలకు మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ సీనియర్ నాయకులు అందె నాసరయ్య, సీహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, ప్రభాకర్, ఎస్డి మౌలాలి, జిల్లా అధ్యక్షులు కరుణానిధి తదితరులు ఉన్నారు

బడిలో గుడ్లు మాయం

విశాలాంధ్ర-టంగుటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ టంగుటూరు మండలంలోని పలు పాఠశాలలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో టంగుటూరు హైస్కూల్లో విస్తు గొలిపే విషయాలు బట్టబయలు అయ్యాయి. ముందుగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి స్థానిక జూనియర్ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. తరువాత టంగుటూరు హైస్కూల్లో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న ప్రతి ఒక్క విద్యార్థిని మిడ్ డే మీల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. అయితే దాదాపుగా సగానికి పైగా విద్యార్థులు ఇంటి వద్ద నుండి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్నారని కమిషన్ సభ్యులు గమనించారు. విద్యార్థులు ఇంటి భోజనం ఎందుకు తింటున్నారని ప్రధానోపాధ్యాయురాలిని ఎంఈఓ ను కమిషన్ సభ్యులు ప్రశ్నించారు. వారు పొంతనలేని సమాధానాలు బదిలివ్వడంతో స్కూలులోని వంటగదిని పరిశీలించుటకు వెళుతుండగా హైస్కూల్లోనే వండిన పులిహోర మరియు గుడ్లను తరలిస్తూ ఉండగా ఈ భోజనం ఎక్కడికి తీసుకెళుతున్నారని వంట మనిషిని ప్రశ్నించారు. అయితే ఆమె కూడా పొంతనలేని సమాధానాలు బదులిచ్చారు. వంటగదిని పరిశీలించిన కమిషన్ సభ్యులకు 25 కోడి గుడ్లను రహస్యంగా దాచారు దానితోపాటు గడువు ముగిసిన రాగి పిండి వంట గదిలో చూసి విస్తు పోయారు. తదనంతరం మిడ్డే మీల్స్‌కు సంబంధించి స్టాక్ రిజిస్టర్స్ పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో పిల్లలు 90 శాతానికి పైగా మధ్యాహ్న భోజనం చేస్తున్నట్లు హై స్కూల్ సిబ్బంది చూపించే ప్రయత్నం చేశారు. వెంటనే ప్రతి తరగతి గదిలో పిల్లలను ఆరా తీయగా సగానికి పైబడి ఇంటి వద్ద నుండే భోజనం తీసుకువస్తున్నారని వెల్లడి అయింది. దీంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఎంఈఓలు టంగుటూరు హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ టంగుటూరు హై స్కూల్‌లో నిర్వహణపై పలు ఫిర్యాదులు అందడంతో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని అన్నారు. ముఖ్యంగా మిడ్ డే మీల్స్ పిల్లలు అందరూ తీసుకోవటం లేదు తల్లిదండ్రులు కూడా పిల్లలను మిడ్ డే మీల్స్ కు ప్రోత్సహించడం లేదు బడిలో ఆహారం తీసుకుంటే అనారోగ్య పాలవుతున్నారని వదంతులు వినిపిస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం కూడా ఫోర్టిఫైడ్ రైస్ ప్రతి రోజు గుడ్డు డైట్ మెనూలో కూడా మార్పులు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా టంగు టూరు హైస్కూల్ వద్ద జరుగు తున్నాయని స్కూల్ నిర్వహణ కూడా సరిగా చేయడం లేదని నేరుగా కమిషన్ కి ఫిర్యాదులు అందాయని అన్నారు. ఈ తనిఖీలో పిల్లలందరూ మిడ్ డే మీల్స్ ముఖ్యంగా ఆడపిల్లలు తీసుకోవడం లేదని వెల్లడి అయింది అన్నారు. స్టాక్ రిజిస్టర్డ్ వంటగది తనిఖీలు చేయగా పలు అవకతవకలు ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. నిర్ణీత గడువు ముగిసిన 50 కిలోల రాగి పిండి ఉండటంతో దానిని వెంటనే తిరిగి పంపించాలని ఎంఈఓ ప్రధానోపాధ్యాయురాలుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అంతేకాకుండా కంప్లైంట్ బాక్స్ ను కూడా సరిగా నిర్వహించడం లేదు దానిని మహిళా పోలీసు పర్యవేక్షణలో ఉంచి ఫిర్యాదులు వస్తున్నాయా లేదా అని ఫిర్యాదుల కొరకు రిజిస్టర్ కూడా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహించారు అని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో పలు అక్రమాలు వెలుగు చూశాయి వాటిని మొదటి తప్పుగా భావించి నెల రోజులలోగా పరిస్థితులను చక్కబెట్టకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవసేన కుమారి మండల విద్యాశాఖ అధికారులు చెంచు పున్నయ్య తన్నీరు బాలాజీ ఆర్ ఐ హనుమంతరావు జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది వీరాంజనేయులు అనిత మరియు న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నవంబర్ 20న నీటి సంఘాల ఎన్నికలు

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : నీటి సంఘాల ఎన్నికలు నవంబర్ 20వ తేదీన నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.ఆర్‌డిఓలు,తహసిల్దార్లతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ ప్రభుత్వం ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో 92 నీటి సంఘాలు ఉండగా,వాటి పరిధిలో మరో 114 టీసీ (టెరిటోరియల్ కానిస్టెన్సీ) కాల్వలు ఉన్నాయన్నారు.వాటి పరిధిలోని రైతులందరికీ ఓటు హక్కు ఉందన్నారు.నీటి తీరువా చెల్లింపుదారులందరికీ ఓటు హక్కు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.నవంబర్ ఆరో తేదీ నుంచి 10వ తేదీ లోగా ఓటు హక్కు దరఖాస్తులు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు.తక్షణమే ఓటర్ల జాబితా పరిశీలన,అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని,నవంబర్ 13వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికల కొరకు ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు.నవంబర్ 20వ తేదీన ఎన్నికలు ఉంటాయని,సమర్థంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన తెలిపారు.గుంటూరు పరిధిలోని శాసనమండలి గ్రాడ్యుయేట్ స్థానానికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.నవంబర్ ఆరో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుం దన్నారు.గత ఎన్నికల సమయంలో 18 వేలమంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా,వాటిని రద్దుచేసి కొత్తగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు.ఆన్‌లైన్ ద్వారా ప్రస్తుతం ఎనిమిది వేల దరఖాస్తులు వచ్చాయన్నారు.మిగిలిన ఓటర్లంతా తమ ఓటు హక్కు కొరకు దరఖాస్తులు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. నవంబర్ 23వ తేదీన గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలవుతుందన్నారు. డిసెంబర్ 9వ తేదీలోగా అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందన్నారు. సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితాలో పేర్లు లేకపోతే నవంబర్ 28వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.నవంబర్ 9,10 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు పోలింగ్ బూత్‌లలో జరుగుతాయన్నారు. నవంబర్ ఆరో తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. తదుపరి 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు.ఇందుకోసం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు సవ్యంగా చేపట్టాలన్నారు. ఎస్టీలందరికీ ఆధార్ కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు.ఆధార్ కార్డులు లేని ఎస్టీలు 3,299 మంది ఉన్నట్లు సర్వేలో గుర్తించామన్నారు.ఈనెల 25వ తేదీ నాటికి 89 మందికి కార్డులు ఇప్పించామని తెలిపారు.మిగిలిన వారికి తక్షణమే కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాపట్ల జిల్లాలోని ఇనామ్ ఎస్టేట్ భూముల సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు. చీరాల, మార్టూరు, సంతమాగులూరు, పర్చూరు, బల్లికురవ మండలాలలోని ఇనామ్ భూముల సర్వే ప్రక్రియ త్వరగా ముగించాలని,రైతు వారి పట్టాలు ఇవ్వడానికి తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు,ఆర్‌డిఓలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

అధిక రేట్లకు మద్యం అమ్మితే షాపులు సీజ్

ఎస్పీ ఏఆర్ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లా పోలీసు అధికారులు మరియు ఎక్సైజ్ అధికారులతో జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక రేట్లకు మద్యం అమ్మితే ఆ షాపులను సీజ్ చేసి కేసుల నమోదు చేయాలని, జిల్లాలో బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, వాటికీ ఎక్కడి నుండి ఎలా సరఫరా అవుతుందో ఆ లింకును ఛేదించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మద్యం షాపులు/బార్ అండ్ రెస్టారెంట్ నిర్ణీత సమయంలోనే ఓపెన్/క్లోజ్ చేసేలా చేయాలని, నాటు సారాయి, గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని, ఇతర రాష్ట్రాల అక్రమ మద్యంపై జిల్లాలో ప్రత్యేక నిఘా పెట్టాలని, మద్యం షాపు వద్ద రేట్లను డిస్ ప్లే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, నాటుసారా/లిక్కర్ సంబంధిత పాత కేసులో ముద్దాయిలను ముందస్తుగా బైండోవర్ చేయాలని, ఎక్కువ కేసులు నమోదైతే వారిపై పిడి యాక్ట్ ప్రతిపాదనలు కూడా పంపించాలని, కేసులోని ముద్దాయిలను పట్టుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని, స్థానిక పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి విజయ, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు, డీపీఈఓ మొహిద్దీన్, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు ఏఈఎస్ ఎర్ర వెంకట్, మార్కాపురం ఏఈఎస్ బాలయ్య, ఏఈఎస్ ఎన్ఫోర్స్మెంట్ జనార్ధనరావు, ఎస్పి ఇన్స్పెక్టర్ కె.వి. రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సిఐ హజరత్తయ్య, చీమకుర్తి సీఐ సుబ్బారావు, కనిగిరి సీఐ ఖాజావలి, ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన గండి వీరారెడ్డి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ సందర్శించడానికి దోర్నాల విచ్చేసిన రాష్ట్ర మంత్రివర్యులు నీటిపారుదల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు నీ, మరియు,రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ ఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్‌నీ దోర్నాల మండల బిజెపి అధ్యక్షుడు సూరవరం గండి వీరారెడ్డి మంగళవారం మండల కేంద్రమైన దోర్నాల్లోని వెలుగొండ అతిథి గృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ నాగేశ్వరరావు దోర్నాల బిజెపి మండల అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి, పెద్దారవీడు బిజెపి మండల అధ్యక్షుడు బి కోటిరెడ్డి, ఎర్రగొండపాలెం మండల అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణ రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు కాసిం పేరా,డి రమేష్ బి వివేక్ (నాని) తదితరులు పాల్గొని శాలువా బొకేలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం మంత్రివర్యులు దృష్టికి వెలిగొండ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి అయి నట్లయితే అంత మేలు జరుగుతుందని వలసలు నివారణ జరుగుతుందని,పేద బడుగు వర్గ ప్రజలు ఎంతో ఆనందంగా జీవించడానికి వెంటనే, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు నీరు అందించాలని మంత్రులను కోరారు.

టీ-5 కాలువను చిన్న కండలేరు వరకు పొడిగించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : టీ-5 కాలువను పుల్లలచెరువు చిన్న కండలేరు వరకు పొడిగించి, ఈ ప్రాంతానికి సాగు, త్రాగు నీరు అందించాలని నీటీ పారుదల శాఖ మంత్రి నిర్మల రామానాయుడు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ వినతి పత్రం అందజేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 2వేల కోట్ల మంజూరు చేయాలని కోరుతూ అదేవిధంగా వెలుగొండ ప్రాజెక్ట్ పరిధిలో తీగలేరు కాలువను పొడిగించి పనులు చేపట్టాలని, చిన్న కండలేరు రిజర్వాయర్ కింద దాదాపు 2వేల ఎకరాలు సాగులో ఉందని, శాశ్వత పరిష్కారం టీ-5 కాలువ ద్వారానే నెరవేరుతుందని రైతులు ఆకాంక్షిస్తున్నారు. ఆయన వెంట సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి.గురునాథం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, రైతు సంఘం నాయకులు సాంబశివరావు, నక్కా తిరుపతయ్య, బాణాల రామయ్య ఉన్నారు.

పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-కొనకనమిట్ల :

మండలంలోని నాగరాజు కుంట, గ్రామం, కొనకనమిట్ల గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి కే ప్రసన్న రంగలక్ష్మి పొలం పిలుస్తుంది నిర్వహించారు. కంది, మిరప పంటలపై, ఆశించదు తెగుళ్లు పురుగులు వాటి నివారణపై రైతులకు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవితేజ, తిరుపతి. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దేవరపు హనుమంతరావు మృతి

విశాలాంధ్ర-పామూరు : నుచ్చుపొద మాజీ సర్పంచ్, హనుమాన్ కంకర మిల్లు స్థాపకులు దేవరపు హనుమంతరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి హనుమంతరావు తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ పట్టించుకుని సమీపంలో ఉన్న ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డుపై ఎదురుగా వస్తున్న గేదలు తగిలి రోడ్డుపై పడిపోయాడు. 108 వాహనంలో వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భూ సమస్యల పరిష్కారమే గ్రామసభ

విశాలాంధ్ర-సంతనూతలపాడు : గతంలో జరిగిన రీ సర్వే భూ సమస్యల పరిష్కారమే కొరకే ఈ గ్రామ సభ అని తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అన్నారు. మండలం పి తక్కెళ్ళపాడు గ్రామం నందు మంగళవారం జరిగిన రీ సర్వే రెవెన్యూ గ్రామ సభకు 40 అర్జీలు దాఖలు అయ్యాయి. తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ఎంపీపీ బుడంగుంట విజయ లు ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ గ్రామ సభ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ తక్కెళ్ళపాడు టిడిపి అధ్యక్షులు నలు మోతు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. రీ సర్వే గ్రామ సభను రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమిని విక్రయించేందుకు యత్నం

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని పరమట ఇరాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే 8 నెంబర్‌లో సుమారు 527:30 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేయడమే గాక కొందరు వ్యక్తులు అమ్ముకుంటున్నారని మంగళవారం వీరాయపాలెం గ్రామానికి చెందిన ఎస్సీలు బీసీలు తహసిల్దార్ కార్యాలయంలో అర్జీని అందజేశారు ఈ ప్రభుత్వ భూమిలో కొంత భూమిని వీరపాలెం గ్రామానికి చెందిన ఎస్సీలు బీసీలకు 1988వ సంవత్సరములో అసైన్మెంట్ కమిటీ ద్వారా ప్రభుత్వము వారికి పట్టాలు మంజూరు చేశారు సబ్ డివిజన్ చేసి పట్టధర్ పాస్ బుక్కులు మంజూరు చేయాలని ఇప్పటినుండి కోరగా విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో అధికారులు గానీ నాయకులు గానీ స్పందించలేదు మరోవైపు రెవెన్యూ అధికారులు ఫారెస్ట్ అధికారులు ఈ భూమి మా మాదంటూ ఉమ్మడి సర్వేలో కొనసాగించకుండా కోర్టులో కేసులు వేసుకుని ప్రస్తుతం పెండింగ్ దశలో ఉంది. ఫారెస్ట్ అధికారులు మాత్రం అప్పుడప్పుడు ఈ భూములను పరిశీలించి వెళ్తున్నారు ఇదే అదునుగా కొంతమంది ఆక్రమణదారులు సుమారు 250 ఎకరాల వరకు ఆక్రమించి గుంటూరు వినుకొండ ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు అమ్మకాలు కొనసాగించారు ఒక వ్యక్తి వేగంగా 100 ఎకరాలకు కంచ ఏర్పాటు చేసుకొని అందులో విద్యుత్ సౌర విద్యుత్తులను ఏర్పాటు చేసుకొని దర్జాగా అనుభవిస్తూ ఉంటున్నాడు అలాగే గుంటూరుకు చెందిన వ్యక్తులకు ఎకరా రెండు లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది మరోపక్క ఇంకొక వ్యక్తి సుమారు 80 ఎకరాల వరకు ఆక్రమించి సాగు చేసుకుంటూ ఉన్నాడు 2008లో ట్రస్టును ఏర్పాటు చేసి ఈ భూమిలో గుడి గోశాలు ఉందంటూ అధికారులకు తప్పుదారి పట్టిస్తూ ఆ భూములను అమ్మకానికి పెట్టారని ఈనెల 28న కొంతమంది సాధువులను తీసుకువచ్చి స్థానిక తహసిల్దార్‌కు కలిసి సర్వే నెంబర్ 8లో ట్రస్టుతో పాటు గోచాలకు చెందినవని అర్జీ ఇచ్చారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పై అవగాహన కలిగి ప్రజలను అప్రమత్తం చెయ్యాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడు కొండల రావు అన్నారు. మెడికల్ కళాశాలలో మంగళవారం ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్, ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా డాక్టర్లు, ఎం.ఎల్.హెచ్.పి, ఆ రోగ్య కార్యకర్తలకు క్యాన్సర్, దయా బెటిస్, రక్త పోటు గురించి అవగాహన కల్పించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆహార నియమాలు సక్రమంగా పాటించక పోక పోవటం, పొగ త్రాగటం, వ్యాయామం చేయక పోవటం వల్ల క్యాన్సర్ వస్తుందని చెప్పారు. సూపరింటెంట్ దుర్గా దేవి మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వటం వలన రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని చెప్పారు. నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ గురించి నిర్ధారణ పరీక్షల గురించి వివరించారు.

బయ్యవరంలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-కురిచేడు : దేకనకొండ రైతు సేవ కేంద్రం పరిధిలో మరియు పెద్దవరం రైతు సేవ కేంద్రం పరిధిలో బయ్యవరం గ్రామాల యందు మంగళవారం మండల వ్యవసాయ అధికారి పి.మధుబాబు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా రైతుల పొలాలను పరిశీలించి తదుపరి గ్రామసభలు నిర్వహించారు.

గ్రంథాలయం ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు : మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీ రెండో లైన్ నందు డాక్టర్ పునీత్ రాజ్ కుమార్ జ్ఞాపకార్ధంగా అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు చేతుల మీదుగా నూతన గ్రంథాలయం ప్రారంభించడం జరిగింది. అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు మాట్లాడుతూ పునీత్ రాజ్ కుమార్ గారి సేవలను ఆదర్శంగా తీసుకొని మేము సైతం సభ్యులు గ్రంథాలయం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమని చెప్పడం జరిగింది. సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ డాక్టర్ పునీత్ రాజ్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది మేము సైతం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో 750 రకముల పుస్తకములు, స్పోర్ట్స్ కిట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఒంగోలులోని నివాసులందరూ ఈ గ్రంథాలయ సౌకర్యములను వినియోగించుకోవాలని కోరారు. నెహ్రూ యువ కేంద్ర డిస్టిక్ యూత్ ఆఫీసర్ కమల్ సా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయశీలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని ముప్పలపాడు గ్రామంలో మంగళవారం గ్రామ సభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో ముప్పలపాడు సిపిఐ గ్రామ పార్టీ కార్యదర్శి రాచూటి రామయ్య డిప్యూటీ తాహసీల్దార్ కిషోర్ కుమార్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాచూటి రామయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి మిగులు భూములను పేద కుటుంబాలకు పంచాలని సిపిఐ గ్రామ పార్టీ కార్యదర్శి రాచూటి రామయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎళ్ల తరబడి ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు,భూములు లేక చేసుకోవటానికి పనులు లేక అనేక ఇబ్బందులకు వారు గురవుతున్నారని ఆయన అన్నారు.కాబట్టి ప్రభుత్వ భూములను కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని సిపిఐ గ్రామ పార్టీ కార్యదర్శి రాచూటి రామయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, సిద్దయ్య, ధనలక్ష్మి,వెంకటయ్య రాజ్యం,మరియు తదితరులు సిపిఐ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మంగళవారం శ్రీ భైరవేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. 7 నెలలకి హుండీ ఆదాయం : 4,80,294 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణ రెడ్డి తెలిపారు.

జీవనాడి 'వెలిగొండ'

విశాలాంధ్ర - మార్కాపురం : ప్రకాశం జిల్లా జీవనాడి అయిన వెలుగొండ ప్రాజెక్టును ప్రాధాన్యతా క్రమంలో త్వరలో పూర్తి చేసి ప్రకాశం జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించడం జరుగుతుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రకాశం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డా.డోలా బాలవీరంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, శాసన సభ్యులు, వివిధ కార్పొరేషన్స్ చైర్మన్లతో కలసి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు సందర్శించిన అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యత ప్రాజెక్ట్లో పోలవరం ప్రాజెక్ట్ తరువాత వెలుగొండ ప్రాజెక్ట్ అని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించి ఫేజ్-1లో హెడ్ వర్క్స్, రెండు టన్నెల్స్, ఫీడర్ ఛానెల్, లైనింగ్ వంటి నిలిచిపోయిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రకాశం జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించేలా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేలా ముఖ్యమంత్రి ఆదేశాలతో ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఈ రోజు ప్రాజెక్టును పరిశీలించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 22 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందు తుందన్నారు. 1996 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వెలుగొండ ప్రాజెక్ట్ కు భూమి పూజ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ను త్వరగా పూర్తి చేసి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేతులమీదుగా ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు విడుదల చేయడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. 2014-19లో గత టిడిపి పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు 1373 కోట్లు కేటాయించి, 1319 కోట్లు అనగా 96శాతం ఖర్చు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. 2019-24 కాలంలో గత ప్రభుత్వం 3 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి కేవలం 170 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. గత 5 సంవత్సరాల కాలంలో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి పనులు చేపట్టకనే పనులు అసంపూర్తిగా మిగిలిపోయి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే 2024 మార్చి 6న అప్పటి ముఖ్యమంత్రి జాతికి అంకితం చేయడం జరిగిందని మంత్రి అన్నారు. హెడ్ వర్క్స్ సంబంధించి, వాల్ పనులు ఇంకా పూర్తి కాలేదని, అలాగే 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి వుందని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం హయాంలో 11 కిలో మీటర్ల లైనింగ్ పనులు 11 సంవత్సరాలు పట్టిందని, ఇంకా 6.8 కి మీ లైనింగ్ పనులు చేపట్టాల్సి వుందని మంత్రి తెలిపారు. వెలుగొండ ప్రాజెక్ట్ ను త్వరగా పూర్తి చేసేలా షెడ్యూల్‌ను తయారు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందని మంత్రి అన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ కు సంబంధించి పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు పూర్తి కాకపోయినా, నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 880 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, ఒక రూపాయి కూడా ఇవ్వకుండానే , ఎన్నికలముందు ఈ ప్రాంత ప్రజలను మభ్య పెట్టి గత ప్రభుత్వ ముఖ్యమంత్రి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు కు సంబంధించి 11 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయనీ, ఈ గ్రామాలకు సంబంధించి 7 పునరావాస కాలనీలను ఏర్పాటు చేయగా, 5 కాలనీల్లో మౌలిక వసతులు 2014-19 మధ్య కాలంలో కల్పించడమే జరిగిందని, గత ఐదు సంవత్సరాలుగా పునరావాస కాలనీల్లో ఎలాంటి పనులు చేపట్టలేదని మంత్రి వివరించారు. రెండో టన్నెల్ లో తవ్విన 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని మొదటి టన్నెల్ చివర భాగాన పోశారు.ఈ మట్టిని తొలగించకుండా నీరు వదలడం సాధ్యం కాదని మంత్రి అన్నారు. ఈ మట్టిని తొలగించాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుందన్నారు. రెండు టన్నెల్స్ నుండి 11,500 క్యూసెక్కుల నీరు తరలించాల్సి ఉండగా, కనీసం 10క్యూసెక్కుల నీరు కూడా తీసుకెళ్ళలేని పరిస్థితి ఉంది. 53 టిఎంసిల సామర్థ్యం ఉన్న నల్లమలసాగర్‌లో కనీసం అర టిఎంసి నీరు కూడా నిల్వ చేయలేని పరిస్థితి ఉందని మంత్రి వివరించారు.ఫీడర్ కెనాల్స్ పరిస్థితి అధ్వాన స్థితిలో వున్నాయని, వీటిని పూర్తి స్థాయిలో పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్ట్స్ నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం సుమారు 980 కోట్ల రూపాయలు కేటాయించాల్సి వుండగా, గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలకు కలిపి కేవలం 225 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. 2024 మార్చిలో ప్రాజెక్టుకు భూమిలిచ్చిన రైతులకు సైతం నోటీసులు ఇచ్చి సభకు రాకుండా అడ్డకుని పూర్తి కాకుండానే , 10 క్యూసెక్కులు కూడా రాని వెలిగొండ ప్రారంభోత్సవం అంటూ ప్రజలను మోసం చేశారని మంత్రి అన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ కు త్వరగా పూర్తి చేయుటకు ముఖ్యమంత్రి గారితో చర్చించి నవంబర్ మాసంలో పనుల షెడ్యూల్ ను తెల్పడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వం ప్రాజెక్టు ల నిర్వహణ పై అలసత్వం వహించడంతో రాష్ట్రంలో ని ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ దెబ్బతినే పరిస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్స్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వలన అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకు పోవడం, పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్ట్స్ గేట్లు కొట్టుకుపోవడం జరిగిందని మంత్రి తెలిపారు. రాబోవు రోజుల్లో వెలుగొండ ప్రాజెక్ట్ ను త్వరగా పూర్తి చేయడంతో పాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు తాగునీరు అందించడం జరుగుతుంది మంత్రి తెలిపారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రకాశం జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు, మార్కాపురం, ఎస్ఎన్ పాడు, కనిగిరి, గిద్దలూరు, కందుకూరు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, కందుల నారాయణరెడ్డి, శ్రీ బి.ఎన్. విజయకుమార్, డా . ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి, శ్రీ ఇంటూరు నాగేశ్వర రావు, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డా. నూకసాని బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, దర్శి, యర్రగొండపాలెం నియోజక వర్గ ఇంచార్జీ లు డా. గొట్టిపాటి లక్ష్మి, ఏరిక్షన్ బాబు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, సీఈ శ్యాంప్రసాద్, ఎస్ఈ అబూతలీం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు నీళ్లు అందిస్తాం

పెద్దదోర్నాలలో.. మండలంలోని కొత్తూరు గ్రామంలో గల పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ రెండు సొరంగం పనులను జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ శాసనసభ్యులు మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ బాధ్యులు ఎరిక్షన్ బాబుతో కలసి మంగళవారం వెలుగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా సొరంగమార్గం ద్వారా బయలుదేరి అక్కడ జరుగుతున్న పనులను జల వనరుల శాఖ అధికారులతో అడిగి తెలుసుకున్నారు.

మా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయండి
మంత్రులకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వినతి

విశాలాంధ్ర-దర్శి : పశ్చిమ ప్రకాశానికి జీవనాడిగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్లేందుకు మంత్రుల బృందం ఈ ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించడం అభినందనీయమని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మంగళవారం యర్రగొండ పాలెం నియోజకవర్గం దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ పరిశీలించిన మంత్రులు, అధికారులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు ప్రాంతాన్ని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సందర్శించారు. దొనకొండ ప్రాంతానికి వెలుగొండ ప్రాజెక్ట్ నీటిని అందించాలని కోరారు. మెట్ట ప్రాంతంగా ఉన్న దొనకొండ ప్రాంతంలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయని కరువు ప్రాంతంగా ఉందన్నారు. జీవనాధారం లేక అక్కడి ప్రజలు హైదరాబాదు, బెంగళూరు, చెన్నైకు వలసలు వెళుతున్నారని ఆమె వివరించారు. అందుకే వెలుగొండ నీటిని దొనకొండకు అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గతంలో మన ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టును దొనకొండకు నీటిని అందించే కాలువలకు ప్రణాళికను రూపొందించారు. అయితే తర్వాత వచ్చిన వైసిపి పాలకులు ప్రాజెక్టును పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి కాలువలను తీయిస్తే వెనుకబడిన దొనకొండ వంటి ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. దీనిపై మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కూడా వెలుగొండ ప్రాజెక్టు నీటిని దొనకొండ పంపించాలని కోరారు.

పంటలకు రసాయన వాడకాలను తగ్గించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : రైతులు పంటలకు రసాయనిక వాడకాలను తగ్గించాలని వ్యవసాయ శాఖ అధికారి చల్లగుండ్ల ఆదినారాయణ అన్నారు.మండలంలోని గన్నవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంటల నిర్వహణ, పంట సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు.గన్నవరం ప్రాంతంలో విస్తృతంగా సాగుచేసే శనగ,పొగాకు పంటలలో కనిపిస్తున్న ప్రధాన సమస్యల గురించి చర్చించి రైతులకు తగిన సలహాలు సూచనలు చేశారు. పర్చూరు ఏడిఏ మాట్లాడుతూ శనగ పొగాకు పంటలపై పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా అధిక మోతాదుల్లో రసాయనాలు వాడటాన్ని తగ్గించాలని,వాటిని శాస్త్రీయ పద్ధతులతో సిఫారసు చేసిన మోతాదులలో మాత్రమే వినియోగించాల్సిన అవసరాన్ని రైతులకు వివరించడం జరి గింది.ఎక్కువ రసాయన వినియోగం వల్ల పంట లపై వివిధ ప్రభావాలు నేల ఆరోగ్యం దెబ్బ తింటుందని, దీంతో భవిష్యత్ పంటల పెరుగుదలకు ఇబ్బందులు కలగవచ్చని రైతులకు అవగాహన కల్పించబడింది. బాపట్ల డిఆర్‌సి,ఏడిఏ రత్నకుమారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ,మట్టి సత్వర ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి సహజ వ్యవసాయ పద్ధతులు ఎంతగానో ఉపయోగపడతాయని,ఈ ప్రక్రియల ద్వారా మట్టి తేమను సంరక్షించుకోవడం,ఖర్చును తగ్గించుకోవడం,మట్టి జీవ వైవిధ్యాన్ని పెంపొందించుకోవడం వంటి ప్రయోజనాలను పొందవచ్చని కూడా వివరించారు. రైతులకు ప్రకృతిశ్రీ వ్యవసాయ విధానాలను అవలంభించడం ద్వారా పంటల ఉత్పాదకత మెరుగుపడుతుందని, అలాగే భవిష్యత్‌తరాల కోసం భూసంరక్షణ అత్యవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

విశాలాంధ్ర - రేపల్లె: రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 30వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని కమిషనర్ సాంబశివరావు తెలిపారు.ఈ సమావేశానికి చైర్పర్సన్ కట్టమంగ అధ్యక్షత వహిస్తారనీ ఏజెండాలో పొందుపరిచిన 35 అంశాలను సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. కావున కౌన్సిల్ సభ్యులు,కో- ఆప్షన్స్ సభ్యులు,మున్సిపల్ ఆయా విభాగాల అధికారులు, సమావేశంలో పాల్గొనాలని కమిషనర్ కోరారు.

వ్యవసాయ శాస్త్రవేత్త రామారావు మృతికి సంతాపం

విశాలాంధ్ర - వేమూరు : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త మొవ్వ రామారావు మృతి వ్యవసాయ రంగానికి తీరంలోటని పలువురు ప్రముఖులు ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన మొవ్వ రామారావు వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు.ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయంలో పని చేస్తూ నూతన వంగడాల రూపకల్పనకు కృషి చేశారని పేర్కొన్నారు.మొవ్వా రామారావుకు ముగ్గురు కుమార్తెలు కుమారుడు ఉన్నారు. గతంలో ఆయన రేడియోలో పాడిపంటలు కార్యక్రమం ద్వారా పలు వ్యవసాయ సూచనలు అందిస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు.ఆయన మృతి పట్ల వేమూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీలు బొలిశెట్టి ప్రభాకర్ రావు,దాసరి ముత్తయ్య,ప్రొఫెసర్ విశ్వనాథం, వ్యవసాయ ప్రముఖులు సంతాపాన్ని వెలిబుచ్చారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దరఖాస్తు చేసుకోండి

టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్

విశాలాంధ్ర - రేపల్లె : కృష్ణ-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికలకు పట్టభద్రులందరూ దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ పిలుపునిచ్చారు.పట్టణంలోని ఏబీఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ కృష్ణ-గుంటూరు జిల్లాల ఉమ్మడి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంపిక చేశారని తెలిపారు. ఆలపాటి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రాడ్యుయేట్ అభ్యర్థుల లను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకొని ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.నియోజకవర్గంలో ఉన్న ఓటర్లంతా దరఖాస్తు చేసుకునేలాగా ఆయా ప్రాంతాల గ్రాడ్యుయేట్లు చొరవ తీసుకోవాలని కోరారు.నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.గత ఎన్నికల జాబితా లేదని,ప్రస్తుతం అందరూ నూతనంగా దరఖాస్తు చేసుకోవాలనే విషయాన్ని ఓటర్లకు తెలియజేసి చైతన్యపరిచారు. కార్యాలయ వ్యక్తిగత సహాయకులు ధర్మతేజ,వివిధ కళాశాలలు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి

ఆర్డీవో చంద్రశేఖర నాయుడు

విశాలాంధ్ర - అద్దంకి : తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు తహసీల్దార్ కార్యాలయ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి మంగళవారం కార్యాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు ఇచ్చే అర్జీలను పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు.మండల ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన పలు అర్జీలను ఆర్డీఓ పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించారు.కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్,వీఆర్వోలు తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర - మార్టూరు : మండలంలో శనగ పంట సాగు చేయు రైతులకు 25శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేయుటకు రైతు సేవ కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ ఏడిఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ద్రోణాదుల చిమ్మిరిబండ గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు.ఇటీవల కురిసిన వర్షాలకు మినుము పంట సాగు చేసి నష్టపోయిన 530 మంది రైతులకు సంబంధించి 1100 ఎకరాల పంటను గుర్తించి అంచనాలు రూపొందించి నివేదికను ఉన్నత అధికారులకు పంపినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.కార్యక్రమాలు ఏవో కిరణ్ కుమార్ రెండు గ్రామాల రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు బీమా చెల్లించాలి

విశాలాంధ్ర-పర్చూరు: రైతులు పంటల బీమా చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.మేరమ్మ తెలిపారు. మండలంలోని కొల్లావారిపాలెం, గర్నెపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఎంఏఓ మాట్లాడుతూ రబీకాలంలో వేసిన శనగ పంటకు పీఎం బీమా యోజన పథకం ద్వారా ఎకరానికి రూ.84 మీసేవాలో చెల్లించాలని తెలిపారు. పంటలను ఈపంటలో నమోదు చేయాలని, అప్పుడే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం, అన్నదాత సుఖీభవ పథకంకు రూ.20 వేలకు రైతులు అర్హులు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ అధికారి ప్రసాద్, వీఏఏలు హేమవర్ధిని, నవీన్‌రాజు, వీఏ నాగేశ్వరి, రైతులు ఉన్నారు.

విద్యుత్తు దీపాలు ఏర్పాటు

- విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - రేపల్లె : నెలల తరబడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంపై వెలగని విద్యుత్ లైట్లు విశాలాంధ్రలో ప్రచురించిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన రేపల్లె పట్టణంలోని తాలూకా ఎదురు ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహంపై విద్యుత్ లైట్లు వెలిగించారు.దీంతో అంబేద్కర్ యువజన సంఘాలు,ప్రజా సంఘాలు,అంబేద్కర్ వాదులు,పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాణాసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

- పట్టణ సీఐ మల్లికార్జునరావు

విశాలాంధ్ర - రేపల్లె : దీపావళి పండుగ సందర్భంగా పోలీసు వారి అనుమతి లేకుండా బాణాల సంఖ్య దుకాణాలు పెట్టడం అమ్మడం అని రేపల్లె పట్టణ సిఐ ఏ.మల్లికార్జునరావు తెలిపారు.నిబంధన ప్రకారం లైసెన్సులు పొందిన వ్యాపారస్తులు మాత్రమే దీపావళి సామాగ్రి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఎవరైనా అనుమతులు లేకుండా బయట దుకాణాలు పెట్టడం,టపాసులు విక్రయించడం,జరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

దాసరి కులధృవీకరణ పత్రాలు అందజేత

విశాలాంధ్ర - రేపల్లె : రెవెన్యూ డివిజన్ అధికారి రేపల్లె వారు నగరం మండలం సజ్జావారి పాలెం గ్రామంలోని హెలీయ దాసరి కులానికి సంబంధించిన అర్జీలను పరిశీలించి వారికి హెలియా దాసరి కుల ధ్రువీ కరణ పత్రాలు (ఎస్సీ)మంజూరు చేసి రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో వారికి అందజేశారు. 12 కుటుంబాలకు అందజేయడం జరిగిందని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు.

14న జాతీయ లోక్అదాలత్

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇచ్చిన పిలుపుమేరకు డిసెంబర్ 14వ తేదీ జాతీయ లోక్ అదాలత్ రేపల్లె కోర్టు ఆవరణలో జరుగుతుందని రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు తెలిపారు.సివిల్,క్రిమినల్, ప్రీ లిటిగేషన్,బ్యాంక్ రుణాల రికవరీ లావాదేవీలు,భార్యాభర్తల వివాదాలు,బిఎస్ఎన్ఎల్ బ్యాంకు లావాదేవీలు తదితర కేసులకు సంబంధించి ఈ లోక్ అదాలత్‌లో కేసులు సత్వరం పరిష్కరించేందుకు వీలుగా కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కోరారు.రేపల్లె,నగరం,నిజాంపట్నం,చెరుకుపల్లి,భట్టిప్రోలు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల కక్షిదారులు లోక్ అదాలత్ సేవలను సద్విని చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెల్లడించారు.

పాఠశాలకు బీరువా వితరణ

విశాలాంధ్ర - అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్ విశ్రాంత ప్రొఫెసర్ జాగర్లమూడి శివకుమారి సౌజన్యంతో చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం ఐరన్ బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి, మల్లాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిలకు క్రీడా దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో వెంకటేశ్వర మెడికల్ షాప్ అధినేత నాగసూరి బాలకృష్ణ సౌజన్యంతో తాళ్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు క్రీడా దుస్తులను వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకర్ రావు, మల్లాది శ్రీనివాసరావు, సంధి రెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, వ్యాయామ అధ్యాపకులు పఠాన్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

- మండల వ్యవసాయ అధికారి విజయబాబు

విశాలాంధ్ర - రేపల్లె : రైతులు సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని రేపల్లె మండలం వ్యవసాయ శాఖ అధికారి ఆర్. విజయ్ బాబు అన్నారు. మండలంలోని పోటుమెరక, కైతేపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు వ్యవసాయశాఖ అధికారి విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకుని పర్యావరణ కాలుష్యం తగ్గించుకోవాలని సూచించారు. మానవ ఆరోగ్య విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే సమగ్ర ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించడం, జరిగింది తదుపరి పంట పొలాలను వ్యవసాయ అధికారి పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల టీడీపీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, మండల వ్యవసాయ అధికారి విజయ్ బాబు, గ్రామ వీపీఏలు అజయ్, గోపి, విక్రమ్, సాయి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : రబీలో రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమాను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొరపాటి వెంకట కృష్ణ తెలిపారు. మంగళవారం బొమ్మనంపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. ఉద్యాన శాఖ అధికారిని దీప్తి మాట్లాడుతూ బిందు తుంపర పరికరాలు రాయితీపై అంది స్తున్నట్లు తెలిపారు. కార్యకమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వ రరావు, రైతులు ఏనుగంటి వెంకటరామయ్య, మోటుపల్లి నాగేశ్వరరావు, మల్లాది నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలను దూషించటం మానుకోవాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి గంటా అంజిబాబు

విశాలాంధ్ర - బాపట్ల : పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిలను వైసీపీ నేతలు దూషించటం మానుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి గంటా అంజిబాబు తెలిపారు. పట్టణంలోని పటేల్ నగర్ లోని తన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై వ్యతిరేకతతో గత ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. వైసీపీతో పాటు టీడీపీ కలిసి రాజశేఖరరెడ్డిపై బురద చల్లడం మానుకోవాలన్నారు. బాపట్ల ప్రాంతం సూర్యలంక అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, కేంద్ర మంత్రిగా చిరంజీవి నిధులు మంజూరు చేసిన అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బాపట్లలో పుట్టిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాపట్ల అభివృద్ధిపై దృష్టి సారించి, జనసేన పార్టీకి చెందిన మంత్రి కందుల దుర్గేష్‌కు ఆదేశించాలని సూచించారు. సూర్యలంక అభివృద్ధి పేరుతో ప్రతి వ్యక్తి దగ్గర నుంచి రూ. 20 వసూలు చేసేందుకు ఎమ్మెల్యేగా గెలిపించలేదనే విషయాన్ని బాపట్ల ఎమ్మెల్యే గుర్తించుకోవాలన్నారు. ఎన్డీఏ కూటమి నేడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. సూర్యలంక అభివృద్ధికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని మరిచి దూషించుకోవటం పరిపాటిగా మారిందన్నారు. సంపద సృష్టి అంటూ సంస్థలు అమ్మకాలకు పెడుతున్నారని నిత్యావసర ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు దోనిపూడి దేవరాజ్, బాబురావు, రోశయ్య తదితరులున్నారు.

సంక్షిప్త సవరణ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

నేటి నుంచి ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - బాపట్ల : సంక్షిప్త సవరణ ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు విడుదల చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయన విడుదల చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా కలెక్టరేట్, అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్వో కార్యాలయాలలో ఉంటుందని, ప్రజలు అక్కడకు వెళ్లి పరిశీలించుకోవచ్చన్నారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఓటు హక్కు లేని వారంతా ఆర్జీలు సమర్పించవచ్చని, ఓటు హక్కు లేని పక్షంలో వారంతా రేపటి నుంచి నవంబర్ 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం ఇన్‌ఛార్జి పర్యవేక్షకులు షేక్ షఫీ, రాజకీయ పార్టీల నాయకులు రామకృష్ణ, కోటేశ్వరరావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే యువజన వారోత్సవాలు

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థులలో సృజనాత్మకత శక్తిని వెలికి తీసేందుకే యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. చీరాల రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో యువజన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తి వెలికి తీయడానికి ప్రతి సంవత్సరం ఈ యువజన వారోత్సవాలు జరుపుతున్నామన్నారు. మంగళవారం వికసిత్ భారత్ 2047 అనే అంశం మీద చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని, వివిధ పాఠశాలల నుండి 203 మంది బాలబాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర్లు, అరవింద్, భవాని, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, పలివేటి మురళీకృష్ణ, పోలుదాసు రామకృష్ణ, దొగుపర్తి వెంకట సురేష్, చీరాల కృష్ణమూర్తి, టి. మల్లికార్జునరావు, జి.వై. ప్రసాద్, టి. లక్ష్మి ప్రతాప్, మామిడాల శ్రీనివాస రావు, తల్లం సాయి గోపాలకృష్ణ, ఎం.వి రామారావు, గుర్రం రాఘవరావు, చుక్కా శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత

విశాలాంధ్ర-కొల్లూరు : మొక్కల పెంపకంతో వాతావరణ సమతౌల్యత సాధ్యపడుతుందని కొల్లూరు పంచాయతీ ఈఓ బి. మల్లికార్జున అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లూరులోని శ్రీ సాయి వాసవి విద్యా సంస్థల విద్యార్థులకు మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలం శ్రీసత్యసాయి బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు మొక్కలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి మొక్కలను నాటి పెంచడంతోపాటు, ప్రజలలో మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు, పీడీ గుమ్మడి రామ్మోహనరావు, హెచ్ఎం జి. లావణ్య, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు మృతి

విశాలాంధ్ర - అద్దంకి : లారీ ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందిన సంఘటన అద్దంకి మేదరమెట్ల మధ్య మంగళవారం జరిగింది. అద్దంకి మండలం విప్పర్లవారిపాలెం గ్రామానికి చెందిన బొనిగల బ్రహ్మయ్య (45) మంగళవారం ఉదయం అద్దంకి నుంచి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి పోవుచుండగా మార్గమధ్యలో బలరామకృష్ణాపురం ఎదురుగా అద్దంకి మేదరమెట్ల రోడ్డులో వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బ్రహ్మయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృత్యువాతకు గురయ్యాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఖాదర్ బాషా పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - చీరాల : ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం సహకారం ఉంటుందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. మంగళవారం చీరాలలోని ఎమ్మెల్యే ఇంటిలో కూచినపూడి నాగేశ్వరరావుకి వైద్య సదుపాయం నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కూచినపూడి నాగేశ్వరరావు, కొత్తవరపు జనార్దన్, గవిని నారాయణ పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కదిరి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం గ్రామానికి చెందిన మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ హాజీమలాన్ కుమారుడు షేక్ హాజీ, ఆసిఫా వివాహ రిసెప్షన్ వేడుక మంగళవారం సిఎస్ పురం లోని ఆర్.యం.యస్ కళ్యాణ మండపంలో జరిగింది. పాలకొల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ రఘుపతి, వ్యవసాయ కళాశాల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రామస్వామి, ఉప సర్పంచ్ బాబురావు, పీరయ్య, ఖాసిం పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సోదరుడు

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని బురుజుపల్లె గ్రామంలో అరిగెల వెంకటేశ్వర రావు కుమార్తె అనిత శ్రీకాంత్‌ల వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవంలో...

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని చిన్న మార్కెట్ సమీపంలోని దర్గాలో నిర్వహించిన ఉరుసు మహోత్సవ వేడుకల్లో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీ హజరత్ దస్తగిరి స్వామి దర్గాల్లో నిర్వహించిన ఉరుసు మహోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా వద్ద కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ టీడీపీ నాయకులు, దర్గా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-రాచర్ల : జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచనల మేరకు గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య రాచర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు డైరీలను, రిజిస్టర్‌లను పరిశీలించి, రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని చెక్ చేసి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది యొక్క పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసులు అన్ని పూర్తి చెయ్యాలి అని సూచించారు.

స్టేషన్ రికార్డ్స్ తనిఖీ చేసి పెండింగ్ కేసులను త్వరగా విచారణ జరిపి కోర్టుకి పంపాలి అన్నారు. బాధితు లతో మర్యాదగా ప్రవర్తించాలి అని నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం జరిగే విధంగా చూడాలి అన్నారు. ముఖ్యంగా గంజాయి ,పేకాట ,గుటక పై ప్రత్యేక నిఘ పెట్టి ఎలాంటి అసాంఘిక కార్యక లాపాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసు కోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ అధికారులు రాత్రిపూట పెట్రోలింగ్ చెయ్యాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

బాణసంచా దుకాణాదారులు
నిబంధనలు పాటించాలి

అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ

విశాలాంధ్ర-మార్కాపురం : బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ సూచించిన నియమ నిబంధనలను పాటించా లని మార్కాపురం అగ్నిమాపక శాఖ అధికారి ఆర్. రామకృష్ణ సూచించారు. దుకాణానికి దుకాణానికి మధ్య సూచించిన దూరం తప్పనిసరిగా ఉండాలని ప్రతి దుకాణానికి రెండు డ్రమ్ముల వాటర్ నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. దుకాణాలను రేకుల షెడ్ల రూపంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్తు అమర్చుకునే సమయంలో షార్టేజ్ రాకుండా చూసుకోవా లన్నారు. మైనర్ పిల్లలను విక్రయించే దుకాణాలలో బాయ్స్ గా ఉంచుకో రాదన్నా రు. తాత్కాలిక అనుమ తులు పొందిన షాపులు 29, 30, 31 తేదీలలో మాత్రమే దుకాణాలు నడుపుకోవాలన్నారు. హైదరాబాదులో జరిగిన ప్రమాద సంఘటనను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది నిఘా ఉంటుందని నిబంధనలకు లోబడి వ్యాపార కొనసాగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు రామకృష్ణ దీపావళి శు భాకాంక్షలు తెలిపారు.

రైతు వాటా ప్రీమియం చెల్లించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని గడికోట మరియు ఆదిమూర్తిపల్లె గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్ లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద రైతులు వారి అంతటవారే పంట భీమా కి రైతు వాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్ లో ప్రకాశం జిల్లా లో శనగ, మినుము, వరి, జొన్న, మొక్క జొన్న, ఎండు మిరప మొదలైన పంటలు పంటల బీమా పథకం కింద వర్తిస్తాయని తెలిపారు. పంటలు భీమా చేయదల్చిన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని మీ-సేవ, బ్యాంకులు మొదలైన చోట పంట భీమా చేసుకోవచ్చని తెలిపారు. పై పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా పంట భీమాకి నమోదు చేసుకోవాలని సూచించారు. పంట భీమా అన్ని పంటలకి 15.12.2024 వరకు వరి పంటకి 31.12.2024 వరకు గడువు తేదీ అని తెలిపారు. గ్రామ సభ అనంతరం శనగ లో విత్తన శుద్ధి ప్రాముఖ్యత గురించి వివరించి, ఏవిధంగా విత్తన శుద్ధి చేయాలో తెలిపారు. అనంతరం కంది,వరి మొదలైన పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన గావించి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు మరియు వాటి నివారణ చర్యలు రైతుల కు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ మరియు పట్టు పరిశ్రమ సహాయకులు రాణా ప్రతాప్ ,సురేఖ వెటర్నరీ సహాయకులు రఘు, జ్యోత్స్న మరియు రైతులు పాల్గొన్నారు.

పరికరాలను రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని రెడ్డి చర్ల , సురవరపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిని కే రాజశ్రీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధి కారిని మాట్లాడుతూ కంది వరి, జొన్న పంటలలో చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. శనగ పంటలో విత్తన శుద్ధి యొక్క ప్రాధాన్యతను మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి విష్ణు ప్రియ మాట్లాడుతూ అరటి మరియు మిరప పంటల్లో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

కూరగాయ పంటల విస్తీర్ణం పెంచడం మరియు ఉద్యాన శాఖ ద్వారా మల్లయ్య పథకాలు మరియు రాయితీ వివరాలను రైతులకు తెలియజేశారు. ఏపీఎంఐపి ఏరియా అధికారి మోహనకృష్ణ మాట్లాడుతూ నీటి ఎద్దడి ఉన్నప్పుడు బిందు మరియు దుంపర సేద్యం బాగా ఉపయోగపడుతుందని ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా 90శాతం మీద బిందు సిద్ది పరికరాలను ఇస్తున్నామని రైతు సేవ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలిపారు ఈ గ్రామ సభ అనంతరం గ్రామంలోని అరటి పంటలను పరిశీలించి బిందు సేద్యం వాడుకొన్న మెలకువలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ మరియు ఉద్యాన నాయకులు కే సిద్దయ్య డి హసీనా మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారి సౌజన్యంతో శ్రీ బాలాజీ లైఫ్ కేర్ పాలి క్లినిక్ డయాగ్నోస్టిక్ సెంటర్ వారి ఆధ్వర్యంలో మంగళవారం హనుమంతుని పాడు మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి చేతుల మీదుగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరం ప్రముఖ వైద్యులు డాక్టర్ ఐవిరెడ్డి,ఎంబిబిఎస్,డి ఎన్ బి, ఆర్తో ఫిజియోథెరపీ సీనియర్ ఎముకల కేరళ వైద్య నిపుణులు డాక్టర్ రామాంజనేయులు ఎంబీబీ ఎస్ సాధారణ వైద్య నిపుణులు ఈ శిబిరం నందు అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం చేసి టాబ్లెట్స్ తదితర మందులు ఉచితంగా అంద చేయటం జరుగుతుందని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఘు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య,మండల ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి,చీకటి వెంకట సుబ్బ య్య,తాతిరెడ్డి వీర నారాయణరెడ్డి,గంటా హరి నాధ్‌రెడ్డి,దుగ్యంపూడి అంకిరెడ్డి,తాతిరెడ్డి పిచ్చిరెడ్డి, మొండెద్దు చిన్నపురెడ్డిలు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీకొని
ఇరువురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. దర్శి నుండి అద్దంకి వైపు వెళ్తున్న లారీ, అద్దంకి నుండి దర్శి వైపు వెళుతున్న బొలెరో వాహనం పసుపు గల్లులోని ఎస్సీ కాలనీ సమీపంలో బ్రిడ్జి వద్ద ఎదురుదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు వాహనాల క్యాబిన్లో ఇరుక్కుపోయారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్సై నాగరాజు తన సిబ్బందితో అక్కడికి వెళ్లి గ్రామస్తుల సహాయంతో జెసిబి తెప్పించి ఇరుక్కుపోయిన వాహన డ్రైవర్లను బయటకు తీయించి 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెండు వాహనాల డ్రైవర్లను క్షేమంగా బయటకు తీయించి, వారి ప్రాణాలు కాపాడి, వారికి ధైర్యం చెప్పిన ఎస్సై వై నాగరాజుకు లారీ డ్రైవర్లు బొలెరో వాహన డ్రైవర్లతో పాటు పసుపుగల్లు గ్రామస్తుల తో పాటు వాహన రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎస్సై కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియా బాబు, కాశి రాజు, కాసిం, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

విశాలాంధ్ర-గిద్దలూరు : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి కె. శ్యాంబాబు గిద్దలూరు లోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీలకు అందుతున్న సదుపాయాలను వసతులను పరిశీలించారు .ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. ప్రైవేటుగా లాయర్ పెట్టుకునే స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని అందజేస్తామన్నారు.అందుకు సంబంధించి సంబంధిత న్యాయ సేవాధికార సంస్థకు జైలు అధికారుల ద్వారా అర్జీ పెట్టుకోవాలన్నారు. సబ్ జైల్ సూపరిండెంట్ యూ.లింగారెడ్డి సబ్ జైల్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూదన్ రావు విచారణ ఖైదీలు నలుగురు ఉన్నారు.

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల క్షేత్రంలో వెలసిన శ్రీ మల్లిఖార్జున స్వామి వారిని మంగళవారం ఉదయం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర-కనిగిరి : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.మంగళవారం కనిగిరి పట్టణంలోని 20వ వార్డు సాగర్ నీళ్ల ట్యాంకుల వద్ద జరుగుతున్నన్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో మెరుగైన పారిశుద్ధం కల్పించుటకు ఎంతైనా ఆవశ్యకత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ కార్యదర్శి శేఖర్ మేస్త్రిలు ఖాదరవల్లి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కంభం చెరువును అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-కంభం : కంభం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి మంగళవారం ఆయన కంభం చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంభం చెరువును తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఇక్కడ సరైన మౌలిక వసతులు లేవని అన్నారు. ప్రభుత్వం ఇక్కడికి వచ్చే పర్యాటకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, అలాగే చారిత్రాత్మకమైన ఈ చెరువుకు తగిన గుర్తింపు తేవాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో వలపర్ల విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర - మార్టూరు : 68వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు తృతీయ స్థానం కైవసం చేసుకుని తమ సత్తా చాటారు.గుంటూరు జిల్లా తెనాలి డిఎస్ఏ స్టేడియంలో జరిగిన అండర్-14 కేటగిరిలో నిర్వహించిన బాల బాలికల భాగంలో వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిద తరగతి విద్యార్థులు ఎం.లారెన్స్,ఎం.కీర్తి పాల్గొని తృతీయ స్థానంలో గెలుపొందారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

- రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - రేపల్లె : సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు న్యాయస్థానాలలో అమలు చేస్తున్న చట్టాలు వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి అవగాహన ఉండాలని రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు.మంగళవారం సాయంత్రం రేపల్లె సబ్ జైల్‌లో ఖైదీలకు వివిధ చట్టాల అమలు వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో అరెస్టు,బెయిల్ ఉచిత న్యాయ సహాయం ఎలా పొందవచ్చు దానికి సంబంధించిన చట్టాలు గురించి ఖైదీలకు వివరించారు.సబ్ జైల్లో అందుతున్న భోజన వసతులు ఇతర సదుపాయాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.సబ్ జైలును న్యాయ మూర్తి సందర్శించారు.ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ కొండపల్లి శ్రీనివాసరావు, సబ్ జైలు అధికారి టి.వెంకటేశ్వరరావు,జైలు సిబ్బంది,కోర్టు సిబ్బంది,కోర్ట్ కానిస్టేబుళ్లు ఖైదీలు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం పంచాయతీ పరిధిలోని ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న చాందినీకి చెందిన ఇంట్లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో కుట్టుమిషన్‌తో పాటు ఇతరులు కుట్టేందుకు ఇచ్చిన దుస్తులు,ఇంట్లో కొంత సామాగ్రి కాలిపోయాయి.విషయం తెలుసుకున్న నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.అయన వెంట టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకులు ఖాదర్ బాబు తదితరులు ఉన్నారు.

→ పెండింగ్ కేసులు ←

విచారణ వేగవంతం చేయాలి

- ◆ అధిక ప్రాధాన్యతతో మహిళ సంబంధిత కేసుల దర్యాప్తు
- ◆ నిఘా కోసం డ్రోన్‌లను వినియోగించాలి
- ◆ ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు
- ◆ బాణాసంచ విక్రయాలకు అనుమతులు తప్పనిసరి
- ◆ జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : నేరాలు జరగడానికి అవకాశం ఉన్న నిర్మానుష్య ప్రాంతాలు,బహిరంగ ప్రదేశాలపై నిఘా ఉంచాలని, డ్రోన్‌లను వినియోగించుకొని ఆ ప్రదేశాను నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ బాపట్ల,చీరాల,రేపల్లె డిఎస్పీలతో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న కేసులు,మహిళా సంబంధిత నేరాలు,దొంగతనం దోపిడీ నేరాలు ఇతర పలు అంశాల గురించి సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్నా కేసుల విచారణ వేగవంతం నిర్వహించాలని ఆదేశించారు.మహిళ సంబంధిత కేసుల విచారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కేసుల దర్యాప్తులో నైపుణ్యతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం వలన వేగవంతంగా చేదించవచ్చునన్నారు. ప్రత్యేకంగా క్రైం పార్టీలను ఏర్పాటు చేసి దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించి బాధితులు పోగొట్టుకున్న నగదును రికవరీ చేయాలన్నారు.సీసీ కెమెరాల నిఘా ఉన్న ప్రదేశాలలో నేరస్తులు నేరాలు చేయడానికి భయపడతారని నేరాలు తగ్గుతాయన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలు, కూడళ్ళలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.నేరాలు జరగడానికి అవకాశం ఉండే నిర్మానుష్యమైన ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీపావళి పండుగ దగ్గరలో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొనే దీపావళి టపాసుల విక్రయ దుకాణాలను బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.గృహాలకు,వైద్యశాలలకు నిర్దిష్ట దూరం ఉండేవిధంగా చూసుకోవాలన్నారు.దీపావళి టపాసులు విక్రయించుకొనే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. ప్రతి దుకాణదారుడు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని,అగ్ని నిరోధక సిలెండర్లు,ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.అనుమతి లేకుండా,నిబంధనలు పాటించకుండ దీపావళి టపాసుల విక్రయలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.బాణసంచా కాల్చే వారు రోడ్డలపై ఇబ్బంది కరంగా వ్యవహరించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో బాపట్ల డిఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డిఎస్పీ పి.జగదీష్ నాయక్, రేపల్లె డిఎస్పీ ఏ.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి

బొమ్మిడి రామకృష్ణ

విశాలాంధ్ర - నిజాంపట్నం : పట్టభద్రులు అందరూ ఓటు నమోదు చేయించుకోవాలని నిజాంపట్నం టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ కోరారు.మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నేత శివప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం నిజాంపట్నం లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి తరుపున ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న వాళ్లు మళ్లీ ఓటును తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే 2021వ సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు కూడా ఓటు హక్కుకు అర్హులని చెప్పారు.ఓటు హక్కు ఆవశ్యకతను తెలియజేస్తూ, అర్హులైన వారు ఓటును నమోదుకు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఓటు హక్కు పొందడానికి నిజాంపట్నం మండల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని అర్హులైన పట్టభద్రులందరూ తమ అర్హత పత్రాలను సమర్పించి ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో నిజాంపట్నం మండల టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ ఇమ్రాన్ ఖాన్, టీడీపీ నాయకులు నరసింహమూర్తి, బొమ్మిడి నాగరాజు, జోసెఫ్ కాగిత, బొమ్మిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కరణం వెంకటేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చీరాల : ప్రజల మనిషి కరణం వెంకటేష్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని చీరాల వైఎస్ఆర్సీపీ నాయకులు అన్నారు.మంగళవారం చీరాల నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా వైఎస్ఆర్సీపీ నాయకులు చీరాల మున్సిపాలిటీ పరిధిలోని కోటయ్య అనాధ మరియు వృద్ధ ఆశ్రమంలో కేక్ కట్ చేసి,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకుడు కరణం వెంకటేష్ అని ఆయన జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్,కంప అరుణ్, బత్తుల అనిల్,గొట్టిపాటి భాగ్యరాజు,కరణం యూత్ కరణం వెంకటేష్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

గొట్టిపాటి హర్షవర్ధన్

విశాలాంధ్ర - అద్దంకి : ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. పట్టణంలోని కామేపల్లి కళ్యాణమండపంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో మంగళవారం అసిస్ట్, నిపుణ సంస్థలు నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అద్దంకి నియోజకవర్గం నుండి నిరుద్యోగ యువతి యువకులు భారీగా హాజరయ్యారు. జాబ్ మేళాలో మొత్తం 36 కంపెనీలు పాల్గొన్నాయి. వీటిలో సాఫ్ట్వేర్ దిగ్గజ కంపెనీలైన జెన్ ఫ్యాక్ట్, యాక్సెంచర్ తదితర కంపెనీలు పాల్గొనడం విశేషం. జాబ్ మేళాకు 23 90 మంది అభ్యర్థులు హాజరు కాగా 525 మందికి గొట్టిపాటి హర్షవర్ధన్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. మరో 300 మందిని రెండవ రౌండ్ ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే ఏకైక లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పై మొదటి సంతకం చేసి 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారని అది కూటమి ప్రభుత్వానికి నిరుద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అని గుర్తు చేశారు. జీవితంలో మనిషికి సక్సెస్ అనేది కేవలం కామా మాత్రమేనని ఫుల్ స్టాప్ అనేది లేనే లేదన్నారు. నియోజకవర్గంలో యువత అభివృద్ధికి

ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాబోయే రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని హర్షవర్ధన్ తెలిపారు.

మైనర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు నడుపుతున్న 12 ద్విచక్ర వాహనాలకు భారీ జరిమానా విధించడంతో పాటు ద్విచక్ర వాహన యజమానులను మందలించారు. మరల మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై వెంకటేశ్వర నాయక్ వాహన యజమానులను విద్యార్థుల తల్లిదండ్రులను హెచ్చరించారు.